ప్రజాశక్తి
ఆదివారం 17 మార్చి, 2024
5
శ్రీకాకుళం

'పది' విద్యార్థులకు ఆర్‌టిసి ఉచిత ప్రయాణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈ నెల 18 నుంచి 30 వరకు జరిగే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆర్‌టిసి ఉచిత బస్సులను నడుపుతున్నట్టు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఇంటి వద్ద నుంచి పరీక్షా కేంద్రం వరకు అన్ని పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం హాల్‌టిక్కెట్‌ను చూపించి ఉచితంగా ప్రయాణం చేయవచ్చున్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలు కల్పిస్తున్నట్టు తెలిపారు. పరీక్షలల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి ఉత్తీర్ణులు కావాలని సూచించారు.

మోగిన నగారా

- షెడ్యూల్‌ను ప్రకటించిన కేంద్ర ఎన్నికల సంఘం
- మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్
- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- నిర్వహణ ఏర్పాట్లల్లో అధికారులు
- ఫిర్యాదుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు

షెడ్యూల్, ఎన్నికల సమాచారం

జిల్లాలో నియోజకవర్గాలు: 8 (శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం, పలాస, ఇచ్ఛాపురం)
నోటిఫికేషన్ విడుదల: ఏప్రిల్ 18, 2024
నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ: మే 3
నామినేషన్ల పరిశీలన : మే 4
ఉపసంహరణ ఆఖరు తేదీ : మే 6
పోలింగ్ తేదీ : మే 20
కౌంటింగ్ : జూన్ 4

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, అర్బన్

ఎన్నికల సమరం ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం పార్లమెంట్‌తో పాటు అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా మే 13న 175 నియోజకవర్గాల్లో ఒకేరోజు పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకు కోసం ఏప్రిల్ 18న నామినేషన్ల ఘట్టం మొదలు కానుంది. జూన్ 4న ఫలితాలు ప్రకటించనున్నారు. షెడ్యూల్ రావడంతో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి కూడా అమల్లోకి వచ్చింది. కోడ్ అమల్లో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. విగ్రహాలకు ముసుగులు తొడిగారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలయ్యారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లో మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వీరిలో పురుష ఓటర్లు మంది ఉండగా, మహిళా ఓటర్లు మంది ఉన్నారు. వీరితో పాటు థర్డ్ జెండర్ ఓటర్లు మంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. శ్రీకాకుళం నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు ఉన్నారు. ఆమదాలవలసలో అత్యల్పంగా 2,36,847 మంది ఓటర్లు ఉన్నారు.

ఎన్నికల కోడ్ అమలు

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కోడ్ అమలుకు అధికారులు రంగంలోకి దిగారు. జిల్లాలో పలు చోట్లఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు తొడిగారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో అధికారులు నూతన కలెక్టర్ కార్యాలయం స్పందన భవనంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కంట్రోల్ రూమ్‌లో మీడియా సెల్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ విభాగం, సోషల్ మీడియా విభాగం, ఫిర్యాదుల పరిశీలన విభాగం, అన్ని వేళలా ఫిర్యాదుల స్వీకరించేలా విభాగం ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరణకు టోల్ ఫ్రీ నంబరు 18004256625 అందుబాటులో ఉంచారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు వరకు పనిచేసేలా 1950 నంబరుతో హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో 08942-240606, 08942-240589, 08942 - 295084 నంబర్లతో మరో ఫిర్యాదు విభాగం ఏర్పాటు చేశారు. అలాగే Email: complaintcell9@gmail.com

నియోజక వర్గాల వారీ ఓటర్లు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం ఓటర్లు
ఇచ్ఛాపురం	1,30,130	1,36,961	17	2,67,108
పలాస	1,06,465	1,11,329	21	2,17,815
టెక్కలి	1,16,880	1.17,555	9	2.34.444
పాతపట్నం	1,11,627	1,122,93	11	2,23,931
శ్రీకాకుళం	1,34,177	1,36,871	31	2,71,079
ఆమదాలవలస	95,629	97,158	15	1,92,802
ఎచ్చెర్ల	1,22,164	1,20,740	14	2,42,918
నరసన్నపేట	1,06,426	1,06,984	13	2,13,423
మొత్తం	9,23,498	9,39,891	131	18,63,520

కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత తొలి ఎన్నికలు

జిల్లా పునర్వవస్థీకరణ తర్వాత ఇవే తొలి ఎన్నికలు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండేవి. ఎస్‌సి, ఎస్‌టిలకు చెరో రిజర్వుడ్ స్థానాలు ఉండేవి. మిగిలిన ఎనిమిది సీట్లు జనరల్ కేటగిరిలో ఉండేవి. జిల్లాల విభజన తర్వాత శ్రీకాకుళం జిల్లాలో ఒక్క స్థానమూ ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాతినిధ్యం లేకుండాపోయింది.

అన్ని స్థానాలకూ వైసిపి అభ్యర్థుల ప్రకటన

ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆయా స్థానాలకు వైసిపి శనివారం ప్రకటించింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలతో పాటు పార్లమెంట్ స్థానానికి అభ్యర్థినీ ప్రకటించింది. టెక్కలి, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో మార్పులు చేయగా, మిగిలిన ఆరింటిలో పాత వారికే అవకాశం కల్పించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ స్థానానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పోటీ చేయగా, ఆయన స్థానంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్‌ను రంగంలోకి దించింది.

నాలుగు చోట్ల టిడిపి అభ్యర్థుల ఖరారు

టిడిపి రెండు విడతలుగా నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. మొదటి జాబితాలో టెక్కలి, ఇచ్ఛాపురం, ఆమదాలవలసకు అభ్యర్థులను ఖరారు చేసింది. రెండో జాబితాలో నరసన్నపేటకు అభ్యర్థిని ప్రకటించింది. జిల్లాకు సంబంధించి మరో నాలుగు స్థానాలకు అసెంబ్లీ, శ్రీకాకుళం ఎంపీ స్థానానికి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

కవాత్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

శ్రీకాకుళంలో పోలీసుల కవాతు

ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సన్నద్ధత తెలిపేలా శ్రీకాకుళం నగరంలో రిజర్వుడ్ పోలీసులు, స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ కూడలి నుంచి పొట్టి శ్రీరాములు కూడలి వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు కవాతులో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పి జి.ఆర్.రాధిక, నగర పాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారీయా కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ కేంద్ర దళాలు, స్థానిక పోలీసులు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని అన్నారు. జిల్లాలో ఫ్లాగ్‌మార్చ్‌లు, రూట్ మార్చ్‌లు, చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీల వంటి విధులు ఎన్నికలు పూర్తయ్యేంత వరకు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా పరిస్థితులు, భౌతిక స్వరూపం, స్థితిగతులను కేంద్ర దళాలకు మ్యాప్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ప్రేమ కాజల్, సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్‌డిఒ సిహెచ్. రంగయ్య, డిఎస్‌పిలు ఎల్.శృతి, వై.శేషాద్రినాయుడు, ఆర్‌పిఎఫ్ ఎస్‌పి, డిఎస్‌పిలు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు: కలెక్టర్

ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమల్లోకి వస్తుందని, నిబంధనలను ఉల్లంఘించిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ చెప్పారు. కలెక్టరేట్‌లో శనివారం ఎస్‌పి జిఆర్ రాధిక, జెసి ఎం నవీన్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, టాయిలెట్లు, ర్యాంపుల నిర్మాణం వంటి అన్ని సౌకర్యాలు సమకూర్చినట్లు చెప్పారు. అభ్యర్థుల నామినేషన్ల ముందు రోజు వరకు కూడా అర్హులైన కొత్త ఓటర్లుగా జాబితాలో చేరుస్తామని చెప్పారు.

లోక్ అదాలత్‌లో 1782 కేసులు పరిష్కారం

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం : జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన కేంద్రంలోని కోర్టులు, ఆముదాలవలస, ఇచ్ఛాపురం, కోటబొమ్మాళి, నరసన్నపేట, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, కొత్తూరు, పొందూరు కోర్టుల్లో మొత్తం 1782 కేసులు రాజీ అయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, అధ్యక్షులు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జునైద్ అహ్మద్ మౌలానా శనివారం తెలిపారు.

ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈ కేసుల్లో భార్యాభర్తలకు సంబంధించిన కేసులు 29 కేసులు, మోటార్ ప్రమాద కేసులు 47, 68 ఎక్సైజ్ కేసులు 627 ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసి నాయుడు పాల్గొన్నారు.

పి.తిలక్, ఎంపీ అభ్యర్థి | పి.విజయ, ఇచ్ఛాపురం | ఎస్.అప్పలరాజు, పలాస | డి.శ్రీనివాస్, టెక్కలి | డి.కృష్ణదాస్, నరసన్నపేట

సిట్టింగ్‌లకే సీట్లు

- రెండు చోట్ల మార్పులు
- టెక్కలికి దువ్వాడ శ్రీనివాస్
- ఇచ్ఛాపురానికి పిరియా విజయ ఖరారు
- శ్రీకాకుళం ఎంపీ స్థానానికి పేరాడ తిలక్
- అభ్యర్థులను ప్రకటించిన వైసిపి

రాబోవు ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాను వైసిపి శనివారం విడుదల చేసింది. జిల్లాకు సంబంధించి ఎనిమిది నియోజకవర్గాలతో పాటు శ్రీకాకుళం ఎంపీ స్థానానికీ అభ్యర్థులను ఖరారు చేసింది. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో సిట్టింగ్‌లపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో వారిని మారుస్తారని ప్రచారం జరిగినా అటువంటి మార్పులేవీ చేయలేదు. ఐ ప్యాక్ సర్వేలు, ఇతర సంస్థల ఫీడ్ బ్యాక్ ఆధారంగా కొద్ది నెలలుగా నియోజకవర్గాలకు అభ్యర్థులను మారుస్తూ వచ్చిన వైసిపి తన నిర్ణయాన్ని మార్చుకుంది. అభ్యర్థుల మార్పు, బదిలీలు బెడిసి కొట్టడటంతో ప్రయోగాల జోలికి వెళ్లలేదని తెలుస్తోంది.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, యంత్రాంగం

శ్రీకాకుళం స్థానం నుంచి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేరును మళ్లీ పోటీ చేయనున్నారు. శనివారం వెలువడిన జాబితాలో పార్టీ అధిష్టానం ఆయన పేరును ఖరారు చేసింది. ఈ స్థానం నుంచి ఆయన పోటీ చేయడం ఇది మూడో సారి. 2014లో వైసిపి నుంచి పోటీ చేసి టిడిపి అభ్యర్థి గుండ లక్ష్మీదేవి చేతిలో ఓటమి పాలయ్యారు. 2019లో అదే పార్టీ నుంచి రంగంలోకి దిగి గుండ లక్ష్మీదేవిని ఓడించారు. మరోసారి ఇక్కడ నుంచి వైసిపి తరుపున బరిలో దిగనున్నారు. టిడిపి తరుపున ఎవరు పోటీ చేస్తారనేది ఇంకా తేల్లేదు. 1989, 1999, 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో నరసన్నపేట నుంచి శాసనసభ్యునిగా అధ్యక్షునిగా పనిచేశాడు.

పలాస నుంచి రెండోసారి

పశుసంవర్ధక మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైసిపిలో 2017లో వైసిపి సమన్వయకర్త బాధ్యతలను చేపట్టారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారి పలాస నియోజకవర్గం నుంచి పోటీ చేసి టిడిపి అభ్యర్థి గౌతు శిరీషపై విజయం సాధించారు. ప్రస్తుతం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఇదే స్థానం నుంచి రెండోసారి పోటీ పడనున్నారు. టిడిపి తన అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.

ఆమదాలవలస టిక్కెట్ తమ్మినేనికే

ఆమదాలవలస స్థానం నుంచి వైసిపి తరుపున శాసనస స్పీకర్ తమ్మినేని సీతారాం మళ్లీ రంగంలోకి దిగనున్నారు. 1983లో టిడిపిలో చేరిన ఆయన ఆ పార్టీ తరపున ఐదుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. 2004, 2009 ఎన్నికల్లో బొడ్డేపల్లి సత్యవతి చేతిలో ఓటమి పాలయ్యారు. 2014 ఎన్నికల్లో మాజీ విప్ కూన రవికుమార్ చేతిలో ఓటమి చవిచూశారు. 2019 ఎన్నికల్లో కూన రవికుమార్‌పై విజయం సాధించారు. ప్రస్తుతం జరగనున్న ఎన్నికల్లో వారిద్దరే మళ్లీ తలపడనున్నారు.

అసమ్మతి ఉన్నా... రెడ్డి శాంతి వైపే మొగ్గు

పాతపట్నం స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే రెడ్డి శాంతికే ఖరారైంది. 2014లో వైసిపి తరుపున శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతిలో పరాజయం పాలయ్యారు. 2019 ఎన్నికల్లో పాతపట్నం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి కలమట వెంకటరమణను ఓడించి తొలి విజయం సాధించారు. రెండోసారి ఇక్కడ నుంచే బరిలో దిగనున్నారు. టిడిపి ఎవరు పోటీ చేస్తారనేది తేల్లేదు.

నరసన్నపేటకు మళ్లీ కృష్ణదాసే

నరసన్నపేట స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మాన కృషదాస్ పేరును పార్టీ ఖరారు చేసింది. 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి తొలి సారి గెలుపొందారు. తర్వాత వైసిపిలో చేరి 2012 ఉప ఎన్నికల్లో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి బగ్గు రమణమూర్తి చేతిలో ఓటమి పాలయ్యారు. టిడిపి బగ్గు రమణమూర్తికే సీటు ఖరారు చేయడంతో మళ్లీ వీరిద్దరే ఎన్నికల్లో తలపడనున్నారు.

టి.సీతారాం ఆమదాలవలస | డి.ప్రసాదరావు శ్రీకాకుళం | కె.కిరణ్‌కుమార్ ఎచ్చెర్ల | రెడ్డి శాంతి పాతపట్నం

అనూహ్యంగా విజయకు అవకాశం

ఇచ్ఛాపురం స్థానానికి జడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ పేరును పార్టీ ఖరారు చేసింది. ఈ ఏడాది జనవరి 11న పార్టీ ప్రకటించిన ఆరో జాబితాలో అనూహ్యంగా ఆమెకు సమన్వయకర్త బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం ఆమెకే సీటు కేటాయించింది. 2019 ఎన్నికల్లో ఆమె భర్త పిరియా సాయిరాజ్ ఇక్కడ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యే బెందాళం అశోక్ చేతిలో ఓటమి పాలయ్యారు. టిడిపి అభ్యర్థిగా మళ్లీ బెందాళం అశోక్ సీటు ఖరాయిన నేపథ్యంలో ఆయనతో పోటీ పడనున్నారు.

కిరణ్‌కుమార్‌కే మళ్లీ అవకాశం

ఎచ్చెర్ల స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కే పార్టీ మళ్లీ అవకాశం కల్పించింది. ఆయనను పార్టీ 2013లో వైసిపి ఎచ్చెర్ల నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. 2014 ఎన్నికల్లో తొలిసారి పోటీ చేసి కళావెంకటరావు చేతిలో ఓటమి పాలయ్యారు. 2019లో అదే కళా వెంకటరావును ఓడించి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఇక్కడ నుంచి టిడిపి తరుపున పోటీ చేసేది ఎవరనేది ప్రకటించాల్సి ఉంది.

టెక్కలి నుంచి శ్రీనివాస్

టెక్కలి స్థానానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అభ్యర్థితత్వం ఖరారైంది. 2009లో సార్వత్రిక ఎన్నికల్లో ప్రజారాజ్యం తరుపున తొలిసారి పోటీ చేసిన ఆయన ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు చేతిలో ఓటమి పాలయ్యారు. 2014లో వైసిపి తరుపున పోటీ చేసి మళ్లీ అచ్చెన్నాయుడు చేతిలో పరాజయం పాలయ్యారు. 2019 ఎన్నికల్లో శ్రీకాకుళం ఎంపీ స్థానం నుంచి పోటీ చేసి ఎంపీ రామ్మోహన్ నాయుడు చేతిలో ఓటమి పాలయ్యారు. టెక్కలి వైసిపిలో అనేక మలుపులు చోటు చేసుకున్న తర్వాత మళ్లీ దువ్వాడకే పార్టీ అవకాశం కల్పించింది. ఎమ్మెల్యే కింజరాపు అచ్చెనాయుడు ఇక్కడ నుంచి పోటీ చేస్తుండటంతో ఆయనతో తలపడనున్నారు.

ఎంపీ స్థానానికి తిలక్ ఖరారు

శ్రీకాకుళం ఎంపీ స్థానానికి పేరాడ తిలక్ పేరును పార్టీ ఖరారు చేసింది. 2019 ఎన్నికల్లో వైసిపి తరుపున పోటీ చేసి కింజరాపు అచ్చెన్నాయుడు చేతిలో ఓడిపోయారు. 2104 ఎన్నికల్లో అనూహ్యంగా ఆయనకు ఎంపీ టికెట్ వరించింది. టిడిపి ఎంపీ అభ్యర్థిగా ఎవరినీ పార్టీ ప్రకటించకపోయినా మళ్లీ రామ్మోహన్ నాయుడే పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. దీంతో వీరిద్దరి మధ్య పోటీ ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది.

కొవ్వాడ అణు పార్కును రద్దు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జపాన్‌లో భూకంపం వల్ల పుకిషిమా అణువిద్యుత్ ప్లాంట్‌ను ప్రభుత్వం మూసివేసిందని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రమాదకర కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని ఇందిరానగర్ కాలనీలో ఉన్న పార్టీ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడారు. రణస్థలం మండలం కొవ్వాడలో అణుపార్కును పెట్టడమంటే ఉత్తరాంధ్రలో అణుబాంబు పెట్టడమేనన్నారు. ఈ ప్రాంతం భూకంపాల జోన్లో ఉందని, ఇక్కడ అణుపార్కు పెట్టడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. అధిక జనసాంద్రత , తరచూ వచ్చే ప్రకృతి వైపరీత్యాలు, మావన తప్పిదాలు, యంత్ర లోపాలు వల్ల ఏ చిన్న ప్రమాదం సంభవించినా కాకినాడ నుంచి అటు ఒరిశా రాష్ట్రం ఛత్రపూర్ వరకూ నాశనం అవుతుందని అన్నారు. భూమి, నీరు, గాలి సమస్తం విషతుల్యమవుతాయన్నారు. దీనివల్ల లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకోవాల్సి వస్తుందన్నారు. అణుపార్కు వల్ల విడుదలయ్యే రేడియో ధార్మికత వల్ల భూమి, నీరు, గాలి, ఆహారం విషతుల్యం అవుతాయని పేర్కొన్నారు. ప్రజలు కేన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధుల బారిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. పుట్టే పిల్లలల్లో అనేక రకాలైన వైకల్యాలను కొని తెచ్చు కోవాల్సి వస్తోందన్నారు. వ్యవసాయ యోగ్యమైన భూములను నాశనమవుతాయని అన్నారు. అత్యంత ప్రమాదకరమైన అణువిద్యుత్కేంద్రాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న గోవిందరావు

వైసిపికి 'సువ్వారి' కుటుంబం గుడ్‌బై

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి, పదవులకు జిల్లా గ్రంథాలయ చైర్మన్ పదవికి సువ్వారి గాంధీ కుటుంబం గుడ్‌బై చెప్పింది. పట్టణంలోని ఆయన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే శాసనసభ్యుల అభ్యర్థుల జాబితాను ప్రకటించారని, అందులో ఆమదాలవలస నుంచి తనకు చోటు దక్కకపోవడంతో తీవ్ర ఆవేదనకు గురై వైసిపికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. గతంలో తమకు టిక్కెట్ ఇస్తామని మాట ఇచ్చి మాట తప్పారని అన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అన్న జగన్... ప్రస్తుతం మాట తప్పి మడమ తిప్పారని అన్నారు. 2012లో వైసిపిలో చేరి 12 ఏళ్ల పాటు పార్టీ కోసం కష్టపడానని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను నట్టేట ముంచి దొంగ ధ్రువపత్రాలు, ఇసుక తదితర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ్మినేని సీతారాం లాంటి వ్యక్తికి టిక్కెట్ కేటాయించడం అవినీతికి జగన్ మద్దతు ఇస్తున్నట్లు భావిస్తున్నామని అన్నారు. ఈ ఐదేళ్లలో అవినీతి, అక్రమాలను పార్టీ దృష్టికి తీసుకెళ్లినా... ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అవినీతి, అక్రమాలకు మద్దతు ఇచ్చినట్లు భావిస్తున్నామని, దీనిని తీవ్రంగా ఖండిస్తూ వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. తమ్మినేని వద్దు - సువ్వారి ముద్దు, కుటుంబ రాజకీయాలను అంతమొందించి ఆత్మ గౌరవాన్ని నిలబెడదామంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ కూడా రాజీనామా చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పొందూరు మాజీ ఎంపిపి సువ్వారి దివ్యలి, సువ్వారి సత్యనారాయణ, సువ్వారి అనిల్‌కుమార్, పేడాడ వైకుంఠరావు, పెయ్యల ప్రసాద్, ఎంపిటిసి మాజీ సభ్యులు పోతురాజు సూర్యారావు, కోరుకొండ సాయికుమార్, మాజీ సర్పంచ్ యతిరాజుల జగన్నాథం, బత్తుల బుజ్జి పాల్గొన్నారు.



రాజీనామా పత్రాలను చూపెడుతున్న 'సువ్వారి' కుటుంబం

వీడని పొత్తుల ముడులు

పొత్తుల రాజకీయాలు జిల్లాలో రసవత్తరంగా మారాయి. పొత్తుల్లో ఎత్తులు వేయడం సాధారణంగానే జిల్లాలో జిత్తులుగా మారే పరిస్థితి నెలకుంది. రాష్ట్రంలో టిడిపి ప్రకటించాల్సినవి మిగిలిన 16 స్థానాల్లో జిల్లాలో నాలుగు స్థానాలు మిగిలి ఉండడం విశేషం. జిల్లా టిడిపికి కంచుకోట అని చెప్పుకునేలా జిల్లాస్థాయి నుంచి అభ్యర్థుల ఎంపికలోనే మట్టికోటగా మారడం విశేషం. టిడిపి అధినేత చంద్రబాబు చెప్పేదొకటి, చేసేదొకటి అన్నది ఆ పార్టీనేతల చెప్పుకునే పరిస్థితి ఉంది. జిల్లాలో శ్రీకాకుళం నియోజకర్గం బిజెపికి కేటాయిస్తారని ఆ పార్టీకి చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. ఈ విషయం ఆ పార్టీ అధికారిక పత్రికల్లోనే ప్రచురితమైంది. ఇదే విషయాన్ని జిల్లాలోని ఓ సీనియర్ నేతను ప్రశ్నించగా, మాకు మాట ఇచ్చారని, కానీ, ఇచ్చి మాటను నిలబెట్టుకోవడం ఆయనకు అవాటు లేదని బదులిచ్చారు. బిజెపికి శ్రీకాకుళం కేటాయిస్తారన్న తరువాతనే ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన సూరేంద్రమోహన్‌ను బిజెపి తెరపైకి తెచ్చింది. ఆయన ప్రస్తుతం విశాఖలో నివాసం ఉంటున్నారు. స్థానికేతరులకు వద్దని జిల్లా నేతలు అభ్యంతరం తెలిపిన తరువాత జిల్లా నుంచి పైడి వేణుగోపాలరావు పేరును తెరపైకి తీసుకొచ్చినట్లు తెలిసింది. రాష్ట్ర బిజెపి ఇన్‌ఛార్జి, రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి కలిసి వేణుగోపాలరావు పేరును అధిష్టానానికి పంపినట్లు తెలిసింది. దీంతో నియోజకవర్గంలో టిడిపి నేతల్లో అలజడి మొదలైంది. అందులో భాగంగానే చంద్రబాబుకు హెచ్చరిక పంపేలా శుక్రవారం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇంటి వద్ద టిడిపి కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. శ్రీకాకుళం సీటు బిజెపికి కేటాయించవద్దని, గుండ లక్ష్మీదేవికి టిక్కెట్ ఇవ్వాలన్నది ఆ నిరసన కార్యక్రమం. అంతేకాదు టిక్కెట్ ఇవ్వకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరికలు కూడా పంపినట్లు తెలిసింది. శిరీషకు టిక్కెట్ ఇవ్వాలని ఆమె తండ్రి శివాజీ ప్రత్యేకంగా చంద్రబాబును ఇటీవల కలిసి వచ్చినట్లు తెలిసింది. అదేవిధంగా ఎచ్చెర్ల టిక్కెట్ కోసం కిమిడి కళావెంకటరావు కూడా కలిసి వచ్చారని తెలిసింది. టిక్కెట్ కోసం గుండ లక్ష్మీదేవి మాత్రం ఎఇలాంటి ప్రయత్నం చేయలేదని తెలిసింది. ఏదేమైనా తమకే వస్తుందన్న నమ్మకంతో ఉన్నట్లు తెలిసింది. జిల్లాలో ప్రకటించిన నాలుగు స్థానాలు పొత్తుల ముడుల్లో చిక్కుకొని వాడే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు. శ్రీకాకుళం స్థానం బిజెపికి కేటాయిస్తే టిడిపి నుంచి తిరుగుబాటు అభ్యర్థులు రంగంలో దిగే పరిస్థితి కనిపిస్తుంది. చివరి క్షణంలోనైనా బిజెపి చెరనుంచి శ్రీకాకుళం విముక్తి చెందుతుందని టిక్కెట్ ఆశించిన నేతలు ఎదురు చూస్తున్నారు.

పలాస నియోజకవర్గం నిన్నటి వరకు జనసేన కోరినట్లు తెలిసింది. అందుకు డాక్టర్ దానేటి శ్రీధర్ ఎదురు చూస్తున్నారు. వైసిపి నుంచి శ్రీధర్ బటయకు వచ్చిన సమయం, చేసిన ప్రకటన ఆయనకు అడ్డంకి అయిందని జనసేన శ్రేణులు భావిస్తున్నట్లు తెలిసింది. మంత్రి ధర్మాన ప్రసాదరావు తన రాజకీయ గురువని ప్రకటించారు. అది నిజం కావచ్చు కానీ పార్టీ వదిలినప్పుడు ఆ ప్రకటనల చేయడం ఆయన అనుభవరాహిత్య రాజకీయం స్పష్టం చేసినట్లయింది.

నిన్నటి వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో పాలకొండ కావాలని చెప్పిన నేతలు, ఇప్పుడు పాతపట్నం సీటును జనసేనకు కేటాయించాలని కోరుతున్నట్లు తెలిసింది. సామాజిక అంశం దృష్టిలో పెట్టుకుని ఎచ్చెర్ల, పాతపట్నం రెండింటిలో జనసేన ఏదో ఒకటి కోరవచ్చునని గతంలో చెప్పాం. ఇప్పుడు అదే జరిగింది. జిల్లాలో పాతపట్నం తెరపైకి వచ్చిన తరువాత పలాస టిడిపికి మారే పరిస్థితి కనిపిస్తుంది. చివరి క్షణంలో ఏ మార్పులైనా జరగవచ్చు. బిగుసుకున్న పొత్తుల ముడులు ఎలానూ విప్పక తప్పదుకదా!

శ్రీకాకుళంతో పాటు ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో టిడిపి గ్రూపుల పోరు బలంగా ఉంది. జనసేనకు కేటాయిస్తే పాతపట్నం గ్రూపుల పోరు ఆ రూపంలో సమసిపోతుంది. ఈ గ్రూపుల పోరుకు విత్తనం జిల్లాలో దశాబ్దాల క్రితం కొబ్బరి చెట్టు గాలితో మొదలైంది. జిల్లాకు చెందిన రాష్ట్ర ముఖ్యనేత అడ్డంకి వల్లనే రెండో జాబితాలోనూ కళావెంకటరావుకు చేయి దొరకలేదని ఆ పార్టీ నేతలే బహిరంగంగా చెబుతున్నారు. అక్కడ పార్టీ నుంచి సస్పెండ్ అయిన నేత పార్టీని వదలకుండా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ఆయన పేరుకూడా ఐవిఆర్ సర్వేలో పొందుపర్చడం చూశాం. సందట్లో సడేమీలా అన్నట్లు ఆ నియోజకవర్గం బిజెపి నేత తనకు టిక్కెట్ వచ్చేలా చూడాలని టిడిపి రాష్ట్ర అధినేతకు కోరినట్లు ప్రచారంలో ఉంది. ఎచ్చెర్లకు సంబంధించి చంద్రబాబు ఆడుతున్న ఈ మూడు ముక్కలాటలో ఏ ముక్కను బయటకు తీస్తారో చూడాల్సి ఉంది. ఆ నియోజకవర్గంలో గట్టి బరోసా లేకుంటే వెన్నుపోటుకు దారితీసే పరిణామాలు చోటుసుకునే పరిస్థితి కనిపిస్తుంది.

వైసిపి అభ్యర్థుల జాబితా విడుదలైంది. గత ఎన్నికల్లో పోల్చితే ఇచ్ఛాపురం, టెక్కలి అభ్యర్థులోనే మార్చారు. ఇచ్ఛాపురం అదే కుటుంబం నుంచి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయను అభ్యర్థిగా ప్రకటించారు. టెక్కలిలో కుడి, ఎడమంగా మార్పు చెందాయి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసిన పేరాడ తిలక్‌ను ఈసారి పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించడమైంది. గత ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన దువ్వాడ శ్రీనివాస్‌ను ఈ సారీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడమైంది. ప్రధానంగా ఆమదాలవలస, పాతపట్నం, పలాస, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో అసంతృప్తులు, నిరసనలు వచ్చినా ఎటువంటి మార్పులు చేయకపోవడం విశేషం. ఇవి పరిగణలోకి తీసుకోకుండా పాత వారినే ప్రకటించడం చూశాం. ముఖ్యనేతలు మగ్గురూ తమ వారసులకు టిక్కెట్లు ఇవ్వాలని కోరారు. అందుకు అధినేత విముఖత చూపడం విశేషం. ఈ ఎన్నికలను ప్రతిష్ఠగా తీసుకున్న జగన్ ప్రయోగాలు చేయడానికి సాహసం చేయలేదని స్పష్టమవుతుంది. పొత్తులు, ఎత్తుల మధ్య ఎవరెవరు శాసనసభలోకి అడుగుపెడతారో పది వారాలు ఆగితే తేలనుంది.

\- సత్తారు భాస్కరరావు

రహదారి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో తలసముద్రం పంచాయతీ దుబ్బవాని పేట, తొన్నాం గ్రామాలకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారికి రూ.70 లక్షలు ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు చేసామని, పనులు వేగవంతం చేయాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణ చైతన్య, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, నాయకులు కణితి సత్తిబాబు, ఆర్.శ్రీనివాసరావు, చింతాడ ఉమ, చింతు రామారావు, భావన వైకుంఠరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సజావుగా 'పది' పరీక్షల నిర్వహణ
కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈ నెల 18 నుంచి 30 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పదో తరగతి పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 28,982 మంది, ప్రయివేటు విద్యార్థులు 1592 మంది హాజరు కానున్నట్లు చెప్పారు. రెగ్యులర్ విద్యార్థుల్లో బాలురు 14,843 మంది, బాలికలు 14139 మంది ఉన్నట్లు వెల్లడించారు. జిల్లాలో మొత్తం 145 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. రోజు విడిచి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులను 8.45 గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని, పరీక్ష సమయం పూర్తయిన తరువాతే బయటకు పంపాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో లోపాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అన్ని పరీక్షా కేంద్రాలను ఆదివారం మరోసారి తనిఖీ చేయాలని, లోటుపాట్లు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులతోపాటు పరీక్షల నిర్వహణ సిబ్బందికి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దన్నారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు, ఇతర అధికారులకు సైతం ఈ నిబంధన వర్తిస్తుందని అన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులతో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. మాస్ కాపీయింగ్ నిరోధించేందుకు 7 ఫ్లయింగ్ స్క్వాడ్లను నియమించామన్నారు. రోజూ కేంద్రాలను తనిఖీ చేస్తాయన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు, పరీక్షల విధుల్లో ఉన్నవారు మినహా ఇతర వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించవద్దన్నారు. పరీక్షల కోసం కంట్రోల్ రూమ్ నంబరు 9494094904.ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

'ఐతమ్'లో ముగిసిన ఎపిపి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఆర్థిక సహకారంతో సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన ఈ నెల 11 నుంచి 16 వరకు 'సస్టైనబుల్ అండ్ రెసిలియంట్ సివిల్ ఇంజినీరింగ్ ప్రాక్టీసెస్' అనే అంశంపై జరిగిన అధ్యాపకుల శిక్షణా తరగతులు శనివారంతో ముగిశాయని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. అధునాతన సాంకేతికత ద్వారా నిర్మాణ రంగంలో వస్తున్న పెను మార్పులను తెలుసుకొని విద్యార్థులకు తరగతి గదుల్లో బోధించేందుకు ఈ అధ్యాపకుల శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర మెట్రోరైల్స్ ఎండీ డాక్టర్ యు.జె.ఎం.రావ్ తరగతులను ప్రారంభించగా, ఐఐటి భువనేశ్వర్ నుంచి ప్రొఫెసర్ డాక్టర్ దినకర్, డాక్టర్ సుమంత్ హల్దార్, ఎన్ఐటి వరంగల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.వి.ఆర్.రవికుమార్, జమ్ము ఐఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వినయ్ చెంబులు, గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.వెంకట్రావు, విశాఖపట్నం ఎయు ప్రొఫెసర్లు డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.బాలప్రసాద్, 60 మంది అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్చడి డాక్టర్ పి.దినకర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ వి.సౌజన్యవాణి, కో-కన్వీనర్లు డాక్టర్ హెచ్.రామ్మోహనరావు, వి.దివ్య, కో-ఆర్డినేటర్ జి.డి.ఆర్.నాయుడు పర్యవేక్షణలో ఈ శిక్షణా తరగతులు అత్యంత క్రమశిక్షణగా జరిగినందుకు నిర్వాహకులకు డైరెక్టర్ నాగేశ్వరరావు అభినందించారు.

రణస్థలం : శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

సామాజిక భవనానికి శంకుస్థాపన

రణస్థలం: జెఆర్.పురం పంచాయతీ గరికిపాలెంలో రణస్థలం, లావేరు మండలాలకు సంబంధించి విశ్రాంతి ఉద్యోగుల సామాజిక భవనానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణం చేపట్టి రెండు మండలాలకు చెందిన విశ్రాంతి ఉద్యోగులు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సిఎం సహాయ నిధి ద్వారా 41 మంది బాధితులకు మంజూరైన రూ.35.57 లక్షల చెక్కులను ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శనివారం పంపిణీ చేశారు.

మండలం పట్నానపేట గ్రామానికి చెందిన బోయి సాయితో పాటు ఎనిమిది కుటుంబాలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ సమక్షంలో వైసిపిలో చేరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతపట్నం: మండలంలోని బడ్డుమర్రిలో రూ.40 లక్షలు ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీధర్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

పలాస: జామి ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఎల్లమ్మజాతర స్థానిక ఎల్లమ్మవీధిలో జరగనుంది. తర్లాకోట జమిందార్ల కాలం నుంచి సాంప్రదాయ పద్ధతిలో ఎల్లమ్మజాతరను నిర్వహిస్తారు. ఆదివారం వేకువజాము నుంచి రాత్రి 12 గంటల వరకూ దర్శనం చేయడానికి తగు ఏర్పాట్లు చేసారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్టు కాశీబుగ్గ సిఐ విజయ్ ఆనంద్ తెలిపారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఎల్లమ్మ ఆలయం వరకు రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వాహనాలు కాంప్లెక్స్ వద్ద నిలిపి వేయాలని, ప్రజలు, వాహన చోదకులు సహకరించాలని కోరారు. యాత్ర ఏర్పాట్లును మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్, కాశీబుగ్గ ఎస్ఐ పారి నాయుడు పరిశీలించారు.

చిరస్మరణీయుడు పొట్టిశ్రీరాములు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్. కె.వి.జి.డి బాలాజీ మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో మొదటిగా ఏర్పడిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కోసం తన ప్రాణాలను సహితం లెక్క చేయకుండా తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి కృషి చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములని కొనియాడారు. కార్యక్రమంలో ఒఎస్‌డి ఎల్.డి. సుధాకర్ బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఎఫ్ఒ అసిరినాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం: ఎస్‌పి కార్యాలయం ఆవరణలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్‌పి జి.ఆర్.రాధిక పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి డాక్టర్ ప్రేమ కాజల్, డిఎస్‌పి ఎల్.శేషాద్రినాయుడు, ఎఒ సిహెచ్.గోపానాథ్, సిఐలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నేటి యువతకు అమరజీవి పొట్టిశ్రీరాములు ఆదర్శప్రాయులని, అటువంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని యువత అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. పొట్టిశ్రీరాములు 123వ జయంతి కలెక్టరేట్‌లో నిర్వహించారు. ముందుగా పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారి ఇ.అనురాధ, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి ఎల్.అప్పారావు, మమత, జి.గణేష్, శేఖర్ పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం, పొట్టిశ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి సంయుక్తంగా శాంతినగర్ కాలనీలోని గాంధీ మందిరంలో జయంతి వేడుకలను నిర్వహించారు. తమ్మన భాస్కరరావు, రిమ్స్ ఆస్పత్రిలోని ప్రసూతి వార్డుకు రూ.60 వేల ఆర్థికసాయంతో తాగునీటి శుద్ధి యంత్రాన్ని వాసవి సేవా సమితి ఆధ్వర్యాన అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండవిల్లి ఎస్.ఎస్.గుప్తా, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మండవిల్లి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల : చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ప్రొఫెసర్ బాలాజీ

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో ఎస్.సంధ్యారాణికి ప్రథమ బహుమతి లభించింది. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి బి.రూపావతి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కె.కె.రామిరెడ్డి, అమ్మనమ్మ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో స్కూల్ చైర్మన్ దక్కత కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ కెసి పూరి, సురేఖ పట్నాయక్, డి.లక్ష్మీనరసింహారెడ్డి, సెక్రటరీ పి.తేజస్, ఎస్‌పిఎల్ మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : మంచినీటి కుళాయిలను ప్రారంభిస్తున్న స్పీకర్ సీతారాం

గడప గడపకు తాగునీరు అందించడమే లక్ష్యం

ఆమదాలవలస: ప్రతి గడపకు తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం మండలం రామచంద్రాపురం, పొన్నాంపేట గ్రామాల్లో రూ.90 లక్షలతో జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి మంచినీటి కుళాయిల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు అవసరాన్ని గుర్తించిన సిఎం జగన్మోహన్ రెడ్డి జల జీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికి మంచినీటి కుళాయిల పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి గ్రామంలో తాగునీరు అందిస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని స్పీకర్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ ప్రతినిధి చల్లా సింహాచలం, ఎంపిటిసి ప్రతినిధి రౌతు దామోదర్ నాయుడు పాల్గొన్నారు.

పొందూరు: మేజర్ పంచాయతీ పరిధిలోని జోగన్నపేటలో స్పీకర్ తమ్మినేని సీతారాం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. బి.ఆర్.అంబేద్కర్, వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈయన వెంట జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, జై ప్రతాప్ కుమార్, నాయకులు మోహన్ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. సరుబుజ్జిలి మండలం కొండవలస, చిగురువలస పంచాయతీల్లో శంఖారావం నిర్వహించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసిపి పాలనలో అరాచకం, అవినీతి తప్ప అభివృద్ధి లేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర భవిష్యత్‌ను ఆలోచించి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. వెన్నెల వలస గిరిజన గ్రామానికి చెందిన 10 గిరిజన కుటుంబాలు రవికుమార్ ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు శివ్వాల సూర్యనారాయణ, కిల్లి సిద్ధార్థ, పూర్ణారావు, హరిగిరి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వంశధార జలాలు అందించాలి

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రైతాంగంపై ఆధారపడి సుమారు 70 శాతం మంది జీవనం సాగిస్తున్నారని, వారికి ప్రయోజనం చేకూరేలా వంశధార, బహుద జలాలతో అనుసంధానం చేయాలని వంశధార జలసాధన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ప్రధాన శివాజీ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని రోటరీ క్లబ్ భవనం వద్ద కమిటీ సభ్యులు, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో బహుద, మహేంద్ర తనయ నదులు, ఇతర చెరువుల ఆధారంగా సుమారు 70 వేల ఎకరాల మెట్ట భూమి ఉందన్నారు. సరైన సాగునీటి వనరులు లేక రైతాంగంపై ఆధారపడిన వారంతా వలస కూలీలుగా ఇతర ప్రాంతాలకు పోతున్నారన్నారు. వంశధార, బహుద నదుల అనుసంధానం జరిగితే వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎస్‌వివి ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్పిలి కృష్ణారావు, ఆసి జీవులు రెడ్డి, డాక్టర్ పూడి కిరణ్, కృష్ణారావు, ఎస్.జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

బాంబే బ్లడ్ గ్రూప్ దానం

శ్రీకాకుళం అర్బన్ : ప్రతిఒక్కరూ తమ రక్తం గ్రూప్ తప్పక తెలుసుకోవాలని, ప్రమాద సమాయాల్లో ఇది ఎంతగానో ఉపకరిస్తుందని రెడ్‌క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలం శివరాంపురానికి చెందిన కిడ్నీ రోగికి అవసరమైన అరుదైన బ్లడ్‌ను విశాఖ జిల్లా భీమునిపట్నానికి చెందిన కాశి లోకేష్‌రెడ్డి శనివారం దానం చేశారు. అసాధారణ గ్రూపులైన ఎబి నెగెటివ్, సబ్ గ్రూప్ ఎ-1, ఎ-2 బ్లడ్ గ్రూపు రక్తదాతలు అరుదుగా ఉంటారన్నారు. అటువంటి వారి వివరాలను తప్పక గమనంలో ఉంచుకోవాలన్నారు. ఆ గ్రూప్ ఉన్న వారికి ఎటువంటి కష్టమొచ్చినా ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సుధీర్, శ్రీకాంత్, రెడ్‌క్రాస్ సభ్యులు కళ్యాణ్ చక్రవర్తి, పోలుమహంతి శ్రీకాంత్, అనంతపల్లి నర్సింగరావు, గుణాకర్, బి.సతీష్ పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి అందజేత

శ్రీకాకుళం అర్బన్ : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని వ్యాపారవేత్త డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, సంతబొమ్మాళి మండల్లాలోని మర్రిపాడు, మేఘవరం, వాలీవలస, వాడివాడ, పొన్నాడ, తామాడ తదితర గ్రామాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 500 మంది పదో తరగతి విద్యార్థులకు అట్టలు, పరీక్షా సామగ్రి శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం ప్రారంభం

ఇచ్ఛాపురం: రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి పిరియా విజయ గెలుపు తథ్యమని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ స్పష్టం చేశారు. శనివారం వైసిపి కార్యాలయాన్ని సమన్వయ కర్త, జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయిరాజ్ మాట్లాడుతూ సిఎం జగన్ పాలనలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. నాలుగు మండలాలు, మున్సిపాలిటీ నాయకులు సమిష్టిగా పార్టీ విజయానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, కడియాల ప్రకాష్, ప్రకాశరావు పట్నాయక్, పి.రాజశేఖర్ రెడ్డి, లోకేశ్వరరావు, సాలీనా ఢిల్లీ, పురుషోత్తం రెడ్డి, పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్పర్సన్ విజయ

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఒడిశా సరిహద్దు వెంబడి దాదాపు 112 కిలోమీటర్ల మేర శ్రీకాకుళం జిల్లా ఉందని, ఇరు రాష్ట్రాల మధ్య జిల్లా వెంబడి 52 రహదారుల ద్వారా రాకపోకలు జరుగుతున్నాయని అన్నారు. వీటిలో ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ఇవి కాకుండా నిరంతరం పెట్రోలింగ్ టీములు పర్యవేక్షణ ఉందని అన్నారు. శనివారం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, గ్రూప్-1 పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై సిఎస్ వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. సమావేశంలో ఎస్‌పి జి.ఆర్.రాధిక, జెసి నవీన్, అదనపు ఎస్‌పి ప్రేమకాజల్, సహాయక కలెక్టర్ రాఘవేంద్రమీనా, డిఆర్ఒ ఎం.గణపతిరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, డిపిఒ వెంకటేశ్వర్లు, జిల్లా గృహనిర్మాణ పీడీ గణపతిరావు, డిఎంహెచ్ఒ మీనాక్షి, జిల్లా వ్యవసాయశాఖాధికారి కె.శ్రీధర్, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వాసుదేవరావు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- పలాస

అన్ని రాజకీయ పార్టీలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని, ఎన్నికల కోడ్ సక్రమంగా అమలయ్యేలా అధికారులు పనిచేయాలని ఆర్‌డిఒ డాక్టర్ భరత్ నాయక్ అన్నారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డివిజన్‌లోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన వెంటనే రాజకీయ పార్టీలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనకు పాల్పడవద్దని సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన జెండాలు, ఫ్లెక్సీ బ్యానర్లు, హోర్డింగులు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పూర్తి సౌకర్యాలు కల్పించామన్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎన్నికలకు సంబంధించి ఎటువంటి కార్యక్రమాలు చేపట్టినా సంబంధిత ఎన్నికల అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుల కోసం 6302384049 ప్రత్యేక నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.

ఎన్నికల సిబ్బందికి ఐటి విభాగంపై శిక్షణ

పలాస : సమావేశంలో మాట్లాడుతున్న భరత్ నాయక్

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఐటి అంశాలపై తహశీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆర్‌డిఒ ప్రారంభించారు.

పోలాకి: ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి అనుసరించేలా చూడాలని డిటి పి.శ్రీనివాసరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్టింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులతో ఎంపిడిఒ భాస్కరరావు సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్ఐ టి.రాజేష్, ఎంఇఒలు ఎస్.దేవేంద్రరావు, ఎం.పద్మనాభరావు, విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై కౌన్సిలర్ల ఆగ్రహం

అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ సూర్యనారాయణ (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు)

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, 15 రోజులకు ఒకసారి నీరు సరఫరా చేస్తున్నారని, ప్రతి సమావేశంలో నీటి ఎద్దడిపై చర్చలే చేస్తున్నారే తప్ప తాగునీరు సరఫరా చేయలేక పోతున్నారని కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, జోగ త్రివేణి మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ, త్రివేణి మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తెలిసినా నివారణ చర్యలు ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. వార్డుల్లో బోర్లు పాడైన బాగు చేయడం లేదని, పవర్ బోర్లు మరమ్మతులకు గురయ్యాయని చెప్పిన పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ స్పందిస్తూ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు నాలుగు ట్యాంకులతో నీరు సరఫరా చేస్తున్నామని తెలిపారు. ఆదివారం నుంచి అదనంగా మరో నాలుగు ట్యాంకులతో నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. పాడైన బోర్లు, పవర్ బోర్లుకు మరమ్మతులు చేపట్టి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు మాట్లాడుతూ బస్టాండ్ సమీపంలో కాలువపై టీ దుకాణాలు పెట్టడంతో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని, దీంతో ప్రయాణికులు, బస్సులు, వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఇదే సమస్యపై చెప్పిన అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. అనంతరం ఎజెండాలో ఉన్న అంశాలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. సమావేశంలో వైఎస్ చైర్మన్ మీసాల సురేష్ బాబు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాజీతో ఇరువర్గాలకు సమన్యాయం

ప్రజాశక్తి- పొందూరు

లోక్ అదాలత్ ద్వారా కేసులు రాజీ చేసుకోవడం వలన ఇరువర్గాలకు సమన్యాయం లభిస్తుందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. జ్యుడిషయల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 137 కేసులు రాజీ కాగా ఇందులో క్రిమినల్ కేసులు 40, ఎన్ఐ యాక్ట్ కేసులు 4, మనీసూట్ కేసులు 2, ఇపి కేసు ఒకటి, ఎక్సైజ్ 86 కేసులు రాజీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్‌అదాలత్ మెంబర్‌గా బ్రహ్మజీ, న్యాయవాదులు మంజుల, అశోక్, కిరణ్, రాము, కృష్ణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో జాతీయ లోక్‌ఆదాలత్ ద్వారా 255 కేసులు పరిష్కరించటం జరిగిందని మండల న్యాయసేవాసంఘం అధ్యక్షురాలు, జూనియర్ సివిల్ జడ్జి బిఎంఆర్ ప్రసన్నలత తెలిపారు. లోక్ అదాలత్‌కు బెంచ్ సభ్యులుగా న్యాయవాదుల సంఘం అధ్యక్షులు దుంపల నరసింహమూర్తి, సీనియర్ న్యాయవాది బమ్మిడి ధర్మారావు వ్యవహరించారు. న్యాయవాదులు పూజారి వాసుదేవరావు, వెలమల అప్పలనాయుడు, ఎజిపి తిరుపతి, పోలీసు, ఎక్సైజ్ అధికారులు, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి ప్రసన్నలత

సోంపేట: స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి జె. శ్రీనివాసరావు, అడ్వకేట్ కళ్యాణి దేవి, జూనియర్ సివిల్ జడ్జి పి.పరేష్ కుమార్, అడ్వకేట్ ఎకెవివి ప్రసాద్ బెంచ్ సభ్యులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా 51 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో అంతర్జాలం ద్వారా జాతీయ లోక్ అదాలత్‌ను ఇన్‌ఛార్జి జూనియర్ సివిల్ జడ్జ్ మణి నిర్వహించారు. సందర్భంగా 130 కేసులు పరిష్కరించారు.

మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- నందిగాం

మండలం దేవపురం పంచాయతీ కొండ తెంబూరుకు చెందిన సిస్టు గున్నయ్య (62) అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈయన దేవపురం పంచాయతీ నుంచి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా పనిచేశారు. ఈయనకు భార్య సరోజిని, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈయన గత కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు.

ఆలయంలో చొరబడిన ఎలుగు

ఆలయంలో ఎలుగు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు:

ఉద్దానంలో ఎలుగుబంట్ల సంచారంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం బాతుపురం గ్రామానికి చెందిన ఆలయంలో ఎలుగు చొరబడడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. అటవీశాఖ అధికారులు చొరవ తీసుకొని ఉద్దానంలో ఎలుగుబంట్ల సంచారాన్ని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బ్యానర్లు తొలగిస్తున్న రెవిన్యూ సిబ్బంది

బ్యానర్ల తొలగింపు

ప్రజాశక్తి- కొత్తూరు

సార్వత్రిక ఎన్నికల కోడ్ శనివారం ఎన్నికల కమిషన్ ప్రకటించడంతో మండల కేంద్రంలో ఉన్న వివిధ రాజకీయ పార్టీల బ్యానర్లు, జెండాలను తహశీల్దార్ ఎం.వి.ప్రసాద్ ఆదేశాలతో రెవిన్యూ సిబ్బంది తొలగించారు. అయితే రాత్రి కావడంతో ఇంకా తొలగించాల్సి ఉన్నాయి.

సన్మానిస్తున్న స్టేట్‌బ్యాంకు ఉద్యోగులు

పురుషోత్తంనాయుడుకు సన్మానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన చౌదరి పురుషోత్తంనాయుడును స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో పురుషోత్తంనాయుడును శనివారం కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువతో సన్మానించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేసే నాయకుడిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాకుళం రీజనల్ సెక్రటరీ వెంకటరమణ, జనరల్ సెక్రటరీ ఎల్.చంద్రశేఖర్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎ.సుష్మా పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్స్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలం కొండములగాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జె.విజయలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ ఎఫ్‌ఎసిగా జి.సింహాచలం పని చేసారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సమిష్టిగా పనిచేసి ఈ ఏడాది అడ్మిషన్లు పెంచడానికి కృషి చేస్తామన్నారు.

పలాస: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కుప్పిలి నరసింహమూర్తి బాధ్యతలు చేపట్టారు. ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్ర అధ్యాపకునిగా ఉన్న ఈయన ప్రిన్సిపాల్‌గా ఉద్యోగోన్నతి పొందారు.

ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలో పురుషోత్తపురం పెద్దవీధిలో బాలాజీ బెహరా ఇంటి నుంచి దనపాన జగన్నాయకులు ఇంటి వరకు సిసికాలువ నిర్మాణం, కల్వర్ట్ నిర్మాణం, పురుషోత్తపురం కాలనీలో గాలి ఈశ్వరి హౌస్ నుంచి సుగ్గు కామరాజు ఇంటివరకు సిసి రోడ్డు నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలకా రాజలక్ష్మీ శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 15వ ఆర్థిక సంఘ నిధులతో కొనుగోలు చేసిన క్యాంపెక్టర్ వాహనం, రెండు ట్రాక్టర్లను కమిషనర్ నల్లి రమేష్ ఆధ్వర్యంలో పురపాలక సంఘ కార్యాలయం ఆవరణలో ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మధుమూర్తి, తేజ, బచ్చు జగన్, సుగ్గు ప్రేమ్ కుమార్, నీలపు లక్ష్మీ పాల్గొన్నారు.

పథకాలపై సమీక్ష

ప్రజాశక్తి- సోంపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ రామారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడిఐ స్వామిత్ర పథకం, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంపై సమీక్షించారు. కార్యక్రమంలో డిఎల్‌పిఒ రమణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

వీధి దీపాలు లేక భయాందోళన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారులో ఉన్న ఇండస్ట్రియల్ పార్కులో వీధిదీపాలు లేక కార్మికులు భయాందోళనలు చెందుతున్నారు. గత కొద్ది కాలంగా వీధి దీపాలు లేక చీకటిమయం కావడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చీకటిమయం కావడంతో పలు దొంగతనాలు కూడా జరుగుతున్నాయని సంస్థ యజమానులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇండస్ట్రియల్ అధికారులు స్పందించి వీధి దీపాలు వేసి సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.